సాక్షి
బాపట్ల
మంగళవారం ■ 6 ■ మే ■ 2025



విష్ణుమూర్తిగా స్వామి దర్శనం

పొన్నూరు: పట్టణంలోని సుందరవల్లీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. విష్ణుమూర్తి అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.



పుస్తక పఠనం అలవరుచుకోవాలి

ప్రత్తిపాడు: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి బి.అరుణ అన్నారు. ప్రత్తిపాడు గ్రంథాలయంలో సోమవారం చిన్నారులతో పుస్తక పఠనం చేయించారు.

మద్దిరాలమ్మ గ్రామోత్సవం



నగరం: ఏలేటిపాలెం గ్రామదేవత మద్దిరాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా సోమవారం గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను ఏలేటిపాలెం నుంచి భట్టువారిపాలెం గ్రామానికి తరలించారు.

న్యూస్‌రీల్

ఘనంగా బగళాముఖి జయంతి పూజలు



చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి జయంతి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జయంతి పూజలలో భాగంగా అమ్మవారి ఆలయంలో 108 కళశాలలో మహిళలు సుగంధ ద్రవ్యాలు తీసుకువచ్చి సామూహిక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి నిజరూప బగళాముఖి అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన స్వర్ణవర్ణపు సింహం విగ్రహాలను అమ్మవారి విగ్రహం ముందు ఇరువైపులా ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జయంతి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగిన శ్రీక్షీరభావన్నారాయణస్వామి



బాపట్ల: శ్రీక్షీరభావన్నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యప్రభ వాహనంపై స్వామి ఊరేగింపు జరిగింది. నవాహ్నిక దీక్ష పూర్వక బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఊరేగింపు చేపట్టారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలు పురవీధుల్లో ఊరేగింపు చేయటంతో భక్తులు టెంకాయలుకొట్టి పూజలు చేశారు.

జీజీహెచ్ సిబ్బందికి మెమోలు

అడిషనల్ డీఎంఈ ఆకస్మిక తనిఖీలు

గుంటూరు జీజీహెచ్: గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలుత గతంలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆషా సజనిపై వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించారు. అనంతరం ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్‌లో తనిఖీలు చేసి, థియేటర్‌లో సక్రమంగా ఓటీ డ్రస్సులు ధరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి సంబంధిత వైద్య సిబ్బంది, వైద్యులకు మెమోలు జారీ చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణను ఆదేశించారు. మార్చురీ విభాగంలో తనిఖీలు చేశారు. లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మనోజ్ మార్చురీ విభాగంలో విధులు నిర్వహిస్తుండటంతో అతనిని అక్కడి నుంచి తొలగించాలని ఆదేశించారు. వైద్య విద్యార్థులకు మార్చురీ విభాగంలో క్లినికల్ తరగతులు నిర్వహించేందుకు వసతులు పరిశీలించారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ విభాగంలో వైద్యులు, వైద్య అధికారులతో సమావేశం నిర్వహించి ఆసుపత్రి అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ, నర్సింగ్ రిజిస్ట్రారు సుశీల తదితరులు ఉన్నారు.

చైల్డ్ హోమ్‌కు పసికందు



పొన్నూరు: మండలంలోని పచ్చలతాడిపర్రు గ్రామ పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన పసికందుకు నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. ఆరోగ్యం కుదుటపడడంతో సోమవారం మగ శిశువును వైద్యశాల డాక్టర్ ఫిరోజ్ ఖాన్ గుంటూరు చైల్డ్ హోమ్ నిర్వాహకులకు సీడీపీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో అందజేశారు.

తిరుపతమ్మ ఆలయానికి ట్రాక్టర్ ట్రక్కు బహూకరణ

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి సోమవారం గ్రామానికే చెందిన కర్ల భాస్కరరావు, పద్మావతి దంపతుల కుమారులు కర్ల రామకృష్ణారావు, వసుంధర దంపతులు, కర్ల శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు రూ.2.50లక్షల విలువైన ట్రాక్టర్ ట్రక్కును బహూకరించారు. గతంలో వీరు ఆలయానికి రూ.10 లక్షల విలువైన ట్రాక్టర్‌ను కూడా అందించారని అధికారులు తెలిపారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఈఓ కిషోర్‌కుమార్, ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు పాల్గొన్నారు.

లైసెన్సులు లాగేశారు

- అద్దంకిలో మంత్రి అనుచరుల ఆగడాలు
- బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాల్లోని లైసెన్సుదారుల నుంచి వాటాలు
- ఎక్స్‌ప్లోజివ్ లైసెన్సులు లాగేసుకున్న వైనం
- 90 శాతం పచ్చనేతలకు 10 శాతం లైసెన్స్ హోల్డర్లకు
- బలవంతంగా అగ్రిమెంట్లు రాయించుకున్నారు
- కాదంటే పేలుడు పదార్థాలు అమ్మలేరంటూ బెదిరింపులు
- మంత్రి అనుచరుల దౌర్జన్యంపై సర్వత్రా చర్చ
- పచ్చ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదుల పరంపర



క్వారీల్లో పేలుడు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: అద్దంకిలో పచ్చ పార్టీ దౌర్జన్యం పతాక స్థాయికి చేరింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ అండ చూసుకొని ఆయన అనుచరులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తోంది. కూటమి అధికారంలోకి రాగానే మంత్రి అనుచరుల చూపు గ్రానైట్ క్వారీల పేలుడు పదార్థాల లైసెన్సులపై పడింది. ఈ ప్రాంతంలో ఉన్న లైసెన్సుదారులను బెదిరించి మొత్తం లైసెన్సులను వారి పేరున అగ్రిమెంట్ రాయించుకున్నారు. ఒకరిద్దరు లెసెన్సుదారులకు 10 శాతం వాటాలు ఇచ్చి మిగిలిన 90 శాతం, మరికొందరి లైసెన్సులు నూటికి నూరుశాతం పచ్చనేతల పేరున రాయించుకున్నారు. ఇది అన్యాయం అన్న వారిని బెదిరించారు. కాదు కూడదంటే పేలుడు పదార్థాలు విక్రయించనిచ్చేది లేదంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. తమ మాటకాదంటే వ్యాపారం మూసేయిస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో లైసెన్సు హోల్డర్లు మంత్రి అనుచరులకు తమ లైసెన్సులు కట్టబెట్టి మిన్నకుండి పోయినట్లు తెలుస్తోంది. అద్దంకి పచ్చనేతల ఆగడాలు బయటకు పొక్కడంతో నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాంతానికి చెందిన కొందరు పచ్చనేతలు అద్దంకిలో జరుగుతున్న దందాలను అధిష్టానానికి చేరవేసినట్లు సమాచారం.

బెదిరించి.. రాయించుకొని..



పేలుడు పదార్థాలు అమరుస్తున్న కార్మికులు

అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ, సంతమాగులూరు, గురిజేపల్లి ప్రాంతాల్లో సుమారు ఏడు వరకూ పేలుడు పదార్థాల లెసెన్సులు ఉండగా చీమకుర్తి కేంద్రంగా ఉండి నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని గ్రానైట్ క్వారీలన్నింటికి బిల్లులు లేకుండా త్రినాథరావు పేలుడు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఇతను మిగిలిన లైసెన్సుదారులకు హైదరాబాద్, నాగపూర్, చెన్నై ప్రాంతాల నుంచి పేలుడు పదార్థాలు వితౌట్‌లో సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. అద్దంకి మంత్రి అనుచరుల ఒత్తిళ్ల మేరకు త్రినాథరావు పలువురు పచ్చనేతలకు తన వ్యాపారంలో వాటాలు అప్పగించినట్లు ప్రచారం వుంది.

పేలుడు మందు విక్రయాల్లో కింగ్‌పిన్ త్రినాథరావు బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, పల్నాడు జిల్లాల్లోని క్వారీలకు చీమకుర్తి కేంద్రంగా గోదాములు ఏర్పాటు చేసుకొన్న త్రినాథరావు పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్నారు. ఇందులో 80 నుంచి 90 శాతం ఎక్స్‌ప్లోజివ్స్‌ను ఎటువంటి బిల్లులు లేకుండా అందిస్తున్నట్లు సమాచారం. మొత్తం వ్యాపారంలో త్రినాథరావు ఒక్కరే నెలకు దాదాపు కోటి రూపాయల వ్యాపారం సాగిస్తూ ప్రభుత్వానికి పెద్ద ఎత్తున పన్నులు ఎగవేస్తున్నట్లు తెలుస్తోంది. వ్యాపారంలో తనకు అడ్డువచ్చిన వారిని అధికారం అడ్డుపెట్టి ఇబ్బందులకు గురిచేయడంలోనూ ఈయన దిట్ట. ఇటీవల మార్టూరుకు చెందిన పేలుడు పదార్థాల లైసెన్సు దారుడు హనుంతరావును అక్రమంగా కేసులో ఇరికించడంలో త్రినాథరావు పాత్ర వున్నట్లు గ్రానైట్ వ్యాపార వర్గాల్లో ప్రచారం వుంది. వాస్తవానికి త్రినాథరావు తొలుత హనుంతరావుతో కలిసి పేలుడు పదార్థాల వ్యాపారం సాగించిట్లు సమాచారం. ఆ సమయంలో వారి గోడౌన్‌లో 4 లారీల పేలుడు సామగ్రి గల్లంతు కావడం పసిగట్టిన హనుంతరావు త్రినాథరావును తన వ్యాపార భాగస్వామిగా తప్పించినట్లు సమాచారం. దీనిని మనస్సులో ఉంచుకొని అక్కసు పెంచుకున్న త్రినాథరావు కూటమి అధికారంలోకి రాగానే హనుమంతరావును పేలుడు పదార్థాల కేసులో ఇరికించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. వితౌట్‌లో లెక్కా పత్రం లేకుండా పేలుడు పదార్థాల సరఫరా వల్ల ప్రమాదాలు లేకపోలేదు. ఇవి అసాంఘిక శక్తులకు చేరితే శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదమూవుంది. మరో వైపు అక్రమ వ్యాపారంతో ప్రభుత్వ రాబడికి గండి కొడుతున్నందున దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశముంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు ముగింపు పలకాలని పలువురు కోరుతున్నారు.

లైసెన్స్‌దారుల ఆందోళన

పచ్చనేతలు దౌర్జన్యంగా పేలుడు పదార్థాల లైసెన్సుదారుల నుంచి 90 నుంచి నూరు శాతం వాటాలు అగ్రిమెంట్లు రాయించుకోవడంతో లైసెన్సుదారుల సమస్య మరింత జఠిలంగా మారింది. పచ్చనేతల పేరున లైసెన్సులు లేనందున వారు అక్రమంగా పేలుడు పదార్థాలు లెక్కా పత్రం లేకుండా విక్రయించినా, వితౌట్‌లో పేలుడు పదార్థాల అమ్మకాలు సాగించినా, విక్రయాలపై సరైన బిల్లులు లేకుండా పట్టుబడినా లెసెన్సుదారులనే ప్రభుత్వం బాధ్యులను చేస్తుంది. దీంతోపాటు పేలుడు సామగ్రి అసాంఘిక శక్తులకు చేరినా, పేలుళ్ల వల్ల ప్రమాదాలు జరిగినా ఇందుకు లైసెన్సుదారులే బాధ్యత వహించాల్సి వస్తుంది. దీంతో లైసెన్సుదారులు మరింత ఆందోళన చెందుతున్నారు.

- బల్లికురవ మండలం గంగపాలెంకు చెందిన పేలుడు పదార్థాల లైసెన్సుదారుడు రమేశ్‌బాబును బెదిరించిన పచ్చనేతలు అతని నుంచి వేమవరానికి చెందిన ఐదుగురు పచ్చనేతలకు నూరుశాతం వాటాలు రాయించినట్లు సమాచారం. పచ్చనేతల బెదిరింపులతో రమేష్ తప్పని పరిస్థితిలో వాటాలు రాయించినట్లు తెలుస్తోంది.
- మార్టూరు మండలం వలపర్ల ప్రాంతానికి చెందిన లైసెన్సుదారుడు మల్లికార్జునరావు మార్టూరు మండలం నాగరాజుపల్లి, బల్లికురవ మండలం కొత్తపాలెం తోపాటు ఈ ప్రాంతానికి చెందిన మరి కొంత మందికి లెసెన్సుల్లో 80 శాతం వాటాలు రాయించినట్లు సమాచారం. మల్లికార్జునరావు కనిగిరి ప్రాంతం నుంచి వచ్చి 25 ఏళ్లగా ఇదే వ్యాపారంలో ఉన్నారు. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.
- సంతమాగులూరు మండలం గురిజేపల్లికి చెందిన లైసెన్సుదారుడు రాజేష్‌కు మార్‌ను బెదిరించి నాగరాజుపల్లి, మార్టూరు గ్రామాల పరిధిలోని ఏడుగురు పచ్చనేతలకు వాటాలు రాయించుకున్నట్లు తెలుస్తోంది.



- బల్లికురవ మండలం రామాంజిపురం ప్రాంతంలోని లైసెన్సుదారుడు హనుమంతరావును బెదిరించి నరసరావుపేట, నాగరాజుపల్లి ప్రాంతాలకు చెందిన ఆంజనేయప్రసాద్, ఈశ్వరరావు, నారాయణతోపాటు హైదరాబాద్‌కు చెందిన మరో వ్యక్తితో కలిపి నలుగురు పచ్చనేతలకు వాటాలు రాయించుకున్నట్లు సమాచారం.
- బల్లికురవ మండలం గంగపాలెం ప్రాంతంలో అత్యధిక పేలుడు పదార్థాల లైసెన్సులు కలిగిన హరిప్రసాద్‌ని బెదిరించి పచ్చనేతలు వాటాలు రాయించుకున్నట్లు ప్రచారం.

పిడకల తిప్పను తవ్వేస్తున్నారు



పిడకల తిప్పపై ఎర్రమట్టి తవ్వకాలకు ఏర్పాటు చేసిన జేసీబీ

- అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు
- విజయవాడ–బెంగళూరు హైవే రోడ్డుకు మట్టి అమ్మకం
- యథేచ్ఛగా అమ్ముకుంటున్న కొండమంజులూరు అక్రమార్కులు
- రెవెన్యూ, మైనింగ్ అండతో ఏడు రోజుల నుంచి తవ్వకాలు
- రోజుకు 200 నుంచి 250 టిప్పర్ల వరకు తోలకం
- టిప్పర్‌కు రూ.7000 నుంచి రూ.8000

జే.పంగులూరు: అధికారుల అండతో కొందరు అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అడిగేవారు లేరని.. చేసిందే వేదంగా అక్రమంగా మట్టిని తవ్వేస్తున్నారు. మండల పరిధిలోని కొండమంజులూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 793 లో 36.74 ఎకరాల్లో గ్రామానికి ఆనుకొని ఎర్రమట్టితో కూడిన పిడకల తిప్ప ఉంది. దీనిపై గ్రామంలోని కొందరి అక్రమార్కుల కన్నుపడింది. ప్రధానంగా మండలంలో విజయవాడ–బెంగళూరు జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్డుకు ఎర్రమట్టి అవసరం వచ్చింది. ఇదే అదనుగా భావించిన కొందరు అక్రమార్కులు మట్టిని సదరు కాంట్రాక్టర్‌కు అమ్ముకుంటున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడా ఎర్రమట్టి దిబ్బ లేకపోవడంతో కొండమంజులూరు పిడకల తిప్పకు మంచి డిమాండ్ వచ్చింది. కన్ను పడటమే తడవుగా గ్రామంలో ఉన్న పిడకల తిప్పపై జేసీబీ, టిప్పర్లు ఏర్పాటు చేశారు.

పక్క పొలాన్ని కౌలుకు తీసుకొని మరీ తరలింపు

ఎర్రమట్టి రోడ్డు మీదుకు రావటానికి వీలుగా ఎర్రమట్టి దిబ్బను అనుకొని ఉన్న పంట పొలాలను సంవత్సరంపాటు ఏడు ఎకరాల మేర కౌలుకు తీసుకొని ఆ పొలాల్లో రోడ్డు వేసి మరీ మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఎకరా కౌలు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పెట్టి తీసుకొని, ప్రకృతి సిద్ధంగా వచ్చిన మట్టిని కొల్లగొడుతూ జేబులు నింపుకుంటున్నారు.

అవినీతిలో మైనింగ్, రెవెన్యూ అధికారులు..

ఏడు రోజుల నుంచి కొండమంజులూరు రెవెన్యూ పరిధిలోని పిడకల తిప్పను రాత్రింబవళ్లు జేసీబీతో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయంటే దీని వెనుక రెవెన్యూ, మైనింగ్ అండదండలు మెండుగా ఉన్నాయని గ్రామస్తులు భావిస్తున్నారు. వారం రోజుల నుంచి గ్రామంలో మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఇప్పటికే 700 టిప్పర్ల పైచిలుకు మట్టి తవ్వకాలు జరిపి అమ్ముకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ అధికారులు వెంటనే మట్టి తవ్వకాలను ఆపేసి ప్రకృతిని కాపాడాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మట్టి తవ్వకాలను నిలిపేశాం


పిడకల తిప్పపై అక్రమంగా జరుపుతున్న మట్టి తవ్వకాలను ఆపివేశాం. వారిని సంబంధిత అధికారుల వద్ద అనుమతులు తెచ్చుకోమని చెప్పాం. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం మట్టి తవ్వకాలకు సంబంధించి మైనింగ్ అధికారుల నుంచి అనుమతులను మంగళవారం అందిస్తాం.

– పీ సింగారావు, తహసీల్దార్

అధికారులకు ఫిర్యాదు



మా గ్రామంలో 10 రోజుల నుంచి గ్రామానికి ఆనుకొని ఉన్న పిడకల తిప్ప నుంచి గ్రామంలో కొందరు జేసీబీతో అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టనట్లుగా వ్యవహరించారు. అధికారుల అండతోనే ప్రకృతి సంపదను కొల్లగొడుతూ కొందరు డబ్బులు దండుకుంటున్నారు. – బొప్పూడి వెంకన్నబాబు, కొండమంజులూరు



మట్టి తవ్వకాలు జరుపుకునేందుకు వీలుగా పంట పొలాల్లో వేసిన ఎర్రమట్టి రోడ్డు

ధాన్యం ధరపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం

- ప్రజాప్రతినిధులు చేసిన తీర్మానాలను పట్టించుకోవాలి
- ఎమ్మెల్యేకి, అధికారులకు మధ్య పరస్పర అవగాహన లోపం
- మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

బాపట్ల: పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని నిలదీయాలని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి రైతులకు పిలుపునిచ్చారు. కనీస మద్దతు ధర కూడా కల్పించకపోవటంతో రైతులు అప్పుల పాలుకావాల్సిన పరిస్థితి నెలకొందని కోన సూచించారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళికి గిట్టుబాటు ధర కల్పించాలని, కర్లపాలెం మండల పరిషత్‌లో తీర్మానించిన వాటిని పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కోన మాట్లాడుతూ ఖరీఫ్ పంటకు గిట్టుబాటు ధర కల్పించటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. రబీలో మినుము, పెసలు, జొన్నలు కొనుగోలు కూడా జాప్యం జరుగుతుందని తెలిపారు. ధాన్యం విషయంలో మద్దతు ధర రూ.1750 కేటాయించగా కనీసం రూ.1300, రూ.1400లకు కూడా ధర రావటంలేదని తెలిపారు. దళారులు ఎక్కువయ్యారని పేర్కొన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఖచ్చితంగా మద్దతు ధర కల్పించటంతోపాటు రూ.2200లకు ధాన్యం విక్రయాలు జరిగాయని గుర్తు చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యానికి మద్దతు ధర లభించిందని సూచించారు. ప్రస్తుతం రైతులు తక్కువ ధరకు ధాన్యం విక్రయాలు చేసుకోవద్దని, అవసరమైతే ప్రభుత్వాన్ని నిలదీసి మద్దతు ధర సాధించుకునేందుకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. రైతులను ఆదుకునేందుకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడు సిద్ధంగానే ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్యే, అధికారుల మధ్య అవగాహన లోపం

కర్లపాలెం మండలంలో మండల సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలను అమలు చేయటంలో అధికారులు చిత్తశుద్ధి చూపటంలేదని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి అన్నారు. ఈమేరకు కోన రఘుపతితోపాటు ఎంపీపీ యారం వనజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మండల సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలను అమలు చేయటంలో అధికారులు చిత్తశుద్ధి చూపటంలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజుకు అక్కడ అధికారులు జరుగుతున్న పరిస్థితులను వివరించటంలేదని తెలిపారు. ఇరువురు మధ్య పరస్పర అవగాహన లోపంతో పనులు కుంటుపడుతున్నాయని పేర్కొన్నారు. కొన్నిచోట్ల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సంబంధం లేదన్నట్లు టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజాప్రతినిధులకు విలువలేకుండా చేయటం ప్రజాస్వామ్యాన్ని కించపరిచినట్లేనని సూచించారు. ఈవిషయాలపై జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, పార్టీ నాయకులు నాగేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, కోకి రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

వేసవి శిక్షణ కేంద్రాల కోలాహలం

పల్నాడు జిల్లాలో 17 క్రీడాంశాల్లో 50 శిక్షణ శిబిరాలు

సత్తెనపల్లి: వేసవి వచ్చిందంటే పిల్లలతో మైదానాలు నిండిపోతాయి. వివిధ రకాల క్రీడలను కోచ్‌లు ఉచితంగా నేర్పిస్తుండడంతో పిల్లలు పెద్ద సంఖ్యలో ఈ వేసవి శిబిరాల్లో చేరుతున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు మైదానాల్లో శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఉదయం, సాయంత్రాలు వేసవి శిబిరాలకు పంపి వారిలో క్రీడానైపుణ్యాలు పెంచుతున్నారు. కోచ్‌లు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పిల్లలకు ఆటల్లో మెలకువలు నేర్పుతున్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుంచి ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. శిక్షణ శిబిరాల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. పల్నాడు జిల్లావ్యాప్తంగా 17 క్రీడాంశాల్లో 50 శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోచ్‌లు కోరుతున్నారు.



సత్తెనపల్లి అమరావతి స్కూల్‌లో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విద్యార్థులు క్రీడాకారులుగా రాణించాలి



జిల్లాలోని విద్యార్థులు మంచి క్రీడాకారులుగా రాణించటానికి వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. క్రీడల్లో మెలకువలను తెలుసుకొని ఆ మేరకు సాధన చేస్తే తప్పకుండా విజేతలుగా నిలుస్తారు. నెల రోజులు పాటు జరిగే వేసవి శిక్షణ శిబిరాలను ఎక్కువమంది వినియోగించుకునేలా క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలి.

–పి.నరసింహారెడ్డి, డీఎస్‌డీఓ, పల్నాడు

క్లుప్తంగా

హిందూ ధర్మం గురించి తెలియజేయాలి



అమర్తలూరు(వేమూరు): సాహిత్య ప్రాజెక్టు హిందూ ధర్మం గురించి ప్రతి ఒక్కరూ తెలియజేయాలని దాస సాహిత్య ప్రాజెక్టు అధ్యక్షులు శ్రీమాన్ గడ్డిపాటి శ్రీనివాసరావు అన్నారు. అమర్తలూరు మండలం గోవాడ గ్రామంలో ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు హిందూ ధర్మ సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన గరువుపాలెంలో హనుమాన్ శోభాయాత్ర, సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 22వ తేదీన ప్రతి గ్రామంలో దేవాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించాలని తెలిపారు. హనుమంతును స్ఫూర్తిగా తీసుకొని ధర్మ రక్షణ కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సమరత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, పొన్నపల్లి సత్యనారాయణ, పడమట వెంకటేశ్వరరావు, చింతల మురళీకృష్ణ, తమ్మన సాంబశివరావు, రామిశెట్టి నరసింహారావు, దాస సాహిత్య భజన మండల సభ్యులు పాల్గొన్నారు.

బేసిక్ పాఠశాలలను కొనసాగించాలి



రేపల్లె: బేసిక్ పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని, ప్రాథమిక పాఠశాల వ్యవస్థను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉపాధ్యాయులు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి విధానాన్ని అన్ని పాఠశాలలలో ఒకే విధంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పాఠశాలల పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఏపీటీఎఫ్ దశల వారి ఉద్యమాలకు ప్రణాళిక రచించిందని అన్నారు. సీనియార్టీ ప్రకారం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, 12వ పీఆర్సీని ప్రకటించి పెండింగ్‌లో ఉన్న ఐఆర్, డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రాజారత్నం, వై.ఆంజనేయ ప్రసాద్, తేలప్రోలు శ్రీనివాసరావు, వై. చెన్నకేశవులు, సీహెచ్.శ్రీనివాస్, ఎం.రాంబాబు. పి.లక్ష్మీనారాయణ, కుర్రా కిరణ్, డి మల్లికార్జునరావు, సత్యనారాయణ, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా ఆక్రమించుకుంటూ బెదిరిస్తున్నారు

స్పందనలో ఎస్పీకి సమస్యలు ఏకరువు పెట్టిన బాధితులు

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 51 మంది బాధితులు హాజరై తమ సమస్యలను నేరుగా ఎస్పీకి విన్నవించుకున్నారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ తుషార్ డూడీ, అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ వెంటనే సంబంధిత సీఐ, ఎస్ఐలతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు వాపోయారు.



ఎస్పీకి సమస్య వివరిస్తున్న చినగంజాంలోని పొదుపు సంఘాల మహిళలు

పొదుపు సంఘాలసొమ్ము రూ.4 లక్షలు స్వాహా



మాది చిన్నగంజాం. మేమంతా సుబ్రమణ్యేశ్వర పొదుపు సంఘంలోని సభ్యులం. మేము ప్రతి నెలా బ్యాంకులో జమచేయాల్సిన రూ.35 వేల సొమ్మును మా లీడర్ కుక్కల పుణ్యవతి చేతికి ఇస్తున్నాం. మా సొమ్ము మొత్తం బ్యాంకులో జమ చేయకుండా విడతల వారీగా రూ.4 లక్షలు స్వాహా చేసింది. తీరా బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ తీయిస్తే రూ.4 లక్షలు చెల్లించాలని చెప్పారు. ఇదేమని అడిగితే సమాధానం చెప్పడం లేదు. గ్రామంలోని పెద్దల సమక్షంలో అడిగించినా ఫలితం ఉండటం లేదు. లీడర్‌ను పిలిచి మా పొదుపు సంఘం సొమ్ము తిరిగి ఇచ్చేలా చూడండి. –పొదుపు మహిళలు

అడ్డగోలుగా ఆక్రమించుకుంటున్నారు



మాది వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామం. మేమంతా చిన్న, సన్నకారు రైతులం. మా ప్రాంతానికి చెందిన తిరుమల సాంబయ్య, ఆయన కుమారులు శంకర్, రవితేజలు అధికారుల అండతో తప్పుడు పత్రాలతో కొమ్మూరి పుణ్యకుమారికి చెందిన 2.77 ఎకరాల జీడిమామిడితోట, పులగూర వెంకటేశ్వర్లుకు చెందిన 60 సెంట్లు, ఇందుర్తి విజయలక్ష్మికి చెందిన 25 సెంట్లు, పోలా శివకుమారికి చెందిన 80 సెంట్లు భూమిని దౌర్జన్యంగా కబ్జాచేశారు. అదేమని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారు. మా సమస్యలు పరిష్కరించమని రెవెన్యూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండటం లేదు. మా పొలాలు మాకు అప్పగించకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యం. – పందిళ్లపల్లి రైతులు

ధాన్యం పురికి నిప్పంటించారు

నేను నా పొలంలోని ధాన్యం కుప్ప నూర్పిడి అనంతరం మా ఇంటి పరిసరాల్లో పురి కట్టించుకొని పురిలో ధాన్యం పోసుకున్నాను. మా గ్రామానికి చెందిన కొందరు గతంలో నా ట్రాక్టర్ సైలెన్సర్‌లో ఇసుకపోశారు. ఇప్పుడేమో పురికి నిప్పటించారు. కొంతమంది అనుమానితుల పేర్లు కూడా పోలీసులకు తెలియజేశాను. దోషులను అదుపులోకి తీసుకొని వారిపై చర్యలు తీసుకోవాలి. – పైడిపాము ఝాన్సీ, సింగుపాలెం, రేపల్లె మండలం

రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ విజేత వైజాగ్



విజేతగా నిలిచిన విశాఖపట్టణం ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు



ద్వితీయ స్థానంలో నిలిచిన హుబ్లీ జట్టు క్రీడాకారులు

- ముగిసిన రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీలు
- ద్వితీయ స్థానంలో హుబ్లీ జట్టు
- విజేతలకు నగదు బహుమతులను అందజేసిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల రూరల్: యువకులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కనబరచి సన్మార్గంలో నడవాలని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కావూరి పవన్‌కుమార్ స్మారక రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని అనేక నగరాలు పట్టణాలతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వాహకులు ఎంతో శ్రమకోర్చి జాతీయస్థాయి పోటీలను తలపించే విధంగా యూ ట్యూబ్‌లో లైవ్ ఏర్పాటు చేశారు. పోటీలో అన్ని విభాగాల్లో రాణించి విశాఖపట్టణం శ్రీధర్ ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు విజేతగా నిలిచారు. రూ.50 వేల నగదు బహుమతితో పాటు భారీ కప్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రీడాకారులు అందుకున్నారు. ద్వితీయ స్థానంలో హుబ్లీ జట్టు నిలిచి రూ.30 వేల నగదు బహుమతి అందుకున్నారు. తృతీయ స్థానంలో విజయవాడ జట్టు నిలిచి రూ.20 వేల నగదు బహుమతి అందుకున్నారు.

ఉత్కంఠగా జరిగిన ఫైనల్ పోరు

ఫైనల్‌లో విశాఖపట్టణం, హుబ్లీ జట్టు తలపడ్డాయి. మొదటి ఫస్ట్ హాఫ్‌లో విశాఖ జట్టు రెండు గోల్స్ చేసింది. అనంతరం సెకండాఫ్‌లో హుబ్లీ జట్టు పుంజుకొని రెండు గోల్స్ సాధించింది. దీంతో నిర్ణీత సమయానికి ఇరుజట్లు క్రీడాకారులు పోటాపోటీగా చిరుతపులుల్లా తలపడి ఆటను సమంగా ముగించాయి. అనంతరం అంపైర్లు ఇరుజట్లకు పెనాల్టీ షూట్ అవుట్ ఇచ్చారు. ఇక్కడ కూడా ఇరు జట్లు సమంగా నిలిచాయి. అనంతరం మరోసారి అవకాశం ఇవ్వగా వైజాగ్ జట్టు అధిక గోల్స్ సాధించి విజేతగా నిలిచింది. పోటీలలో బెస్ట్‌గోల్ కీపర్‌తో పాటు అనేక అంశాలలో సత్తాచాటిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వహకులు నూతలపాటి విజయకుమార్ (దాసు) నూతలపాటి నరేష్, బొనిగల ప్రేమయ్య, నాలుగు జిల్లాల కోఆర్డినేటర్ దేవదాసు, పంబా నాగయ్య, మున్సిపల్ కౌన్సిలర్ సల్లూరి సత్యానందం, క్రీడాకారులు, అంపైర్లు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి

రేపల్లె: మహిళా ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.శ్యామ్ కోరారు. ఏఎన్ఎం కోటేశ్వరమ్మ మృతిపై సమగ్ర విచారణ జరపాలని మెడికల్ విభాగంలో మహిళా ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరమ్మ మృతి చెందటం బాధాకరమన్నారు. పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు కోటేశ్వరమ్మ సూసైడ్ నోట్ రాయడం మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో కేసును పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు. పలు రకాల సర్వేల పేరుతో మెడికల్ ఉద్యోగులను ఉన్నతాధికారులు, ప్రభుత్వం వేధిస్తోందన్నారు. ఫోన్ యాప్ సర్వేలతో సాంకేతి



సీనియర్ అసిస్టెంట్ విజయేంద్రరావుకు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

లోపం కారణంగా మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ అంశాన్ని జిల్లా అధికారులు గుర్తించి మహిళా ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మణిలాల్, ప్రజాసంఘాల నాయకులు కే ఆశీర్వాదం, కేవీ లక్ష్మణరావు, ఏఎన్ఎంలు, మెడికల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా అమ్మనాన్నల కల్యాణం

బాపట్లటౌన్: మండలంలోని జిల్లెళ్లమూడి గ్రామంలో వేంచేసియున్న జగన్మాత మాతృశ్రీ అనసూయ మహాదేవి, బ్రహ్మాండం నాగేశ్వరరావుల కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. విశ్వజననీ పరిషత్ కోశాధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ అనసూయదేవి అందరి అమ్మగా, జిల్లెళ్లమూడి అమ్మగా లోక ప్రసిద్ధి చెందారన్నారు. జిల్లెళ్లమూడి గ్రామానికి ఏ వేళప్పుడు ఎవరొచ్చినా వారికి తృప్తిగా భోజనం పెట్టి వారికి కడుపునింపడం, ఆకలితో జిల్లెళ్లమూడి రావచ్చు కానీ, జిల్లెళ్లమూడి నుంచి ఆకలితో వెళ్లరాదనేది అమ్మ ఆశయమన్నారు. జిల్లెళ్లమూడి అమ్మ తొలినాళ్లల్లో వారి పతిదేవుల సంపాదనతోనే తమ దర్శనార్థం వస్తున్న వారందరికీ స్వయంగా అన్నం వండి, వడ్డించడం చేసేవారన్నారు. అనతి కాలంలో అమ్మ బిడ్డలందరి సమష్టి కృషితో జిల్లెళ్లమూడిలో అన్నపూర్ణాలయం ఏర్పడిందన్నారు. సంవత్సరమంతా నిత్యకల్యాణం, పచ్చతోరణం మాదిరి ఉంటుందన్నారు. అమ్మవారి కల్యాణమహోత్సవంలో భాగంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మనాన్నలకు విశేష పూజా కార్యక్రమాలు జరిగాయన్నారు. కల్యాణం అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మనాన్నల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

కాలువలకు మరమ్మతులు చేయించాలి

బాపట్ల: కృష్ణా పశ్చిమ కాలువ, దుగ్గిరాల డివిజన్, రేపల్లె డివిజన్‌లోని నీటి పారుదల కాలువలు మరమ్మతులు చేయించాలని పలువురు రైతులు ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని కలిసి సోమవారం వినతి పత్రం అందించారు. అమృతలూరు, చెరుకుపల్లి, నగరం, భట్టిప్రోలు, వేమూరు మండలాల పరిధిలోని రైతులు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. కృష్ణ పశ్చిమ కాలువ, దుగ్గిరాల డివిజన్, రేపల్లె డివిజన్లోని నీటి పారుదల ఆధారిత భూములలో వరి పంట సాగు చేస్తున్నామని వివరించారు. రేపల్లె మెయిన్ డ్రెయిన్ (గంగోలు కాలువ) 30 ఏళ్లుగా మురుగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని వివరించారు. ఈ ఏడాది(2024–25) ఖరీఫ్ సీజన్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా రేపల్లె మెయిన్ డ్రెయిన్ పొంగి చెరుకుపల్లి మండలంలోని కనగాల, గూడవల్లి, నడింపల్లి, పొన్నపల్లి గ్రామాలలో వరి పంట, అమృతలూరు, భట్టిప్రోలు, వేమూరు, నగరం మండలంలోని కొన్ని గ్రామాలలో వరి పంట పూర్తిగా దెబ్బతిందని వివరించారు. 2025–26 ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే కాలువను పూర్తిస్థాయిలో పూడిక తీసి, కాలువ సామర్థ్యం పెంచి ముంపు నివారించాలని రైతులు కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మేక మహేష్, గోగినేని బాలకోటేశ్వరరావు, గడ్డిపాటి రాఘవేంద్రరావు, కోట నాగ కోటి వెంకటరమణ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు

పిడుగుపాటుకు గురైన గొర్రెల కాపరి మృతి

కొల్లూరు: పిడుగుపాటుకు గురైన తెలంగాణ రాష్ట్రానికి చెందిన గొర్రెల కాపరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం కురిసిన పిడుగులతో కూడిన వర్షం కారణంగా కొల్లూరు సమీపంలోని క్రాప అడ్డరోడ్డు వద్ద పంట పొలాల్లో గొర్రెలు మేపుతున్న గొర్రెల కాపరి పిడుగుపాటుకు గురై విషమ పరిస్థితుల్లో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విషయం విదితమే. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా కోయలకొండ మండలం చంద్రాస్‌పల్లికి చెందిన వడ్డే అంజనేయులు (22) వర్షం కురుస్తున్న సమయంలో ఫోన్ మాట్లాడుతుండగా అతనికి సమీపంలో పిడిగు పడింది. పిడుగు ధాటికి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న అతనిని పంట పొలాల్లోని కూలీలు గమనించి కొల్లూరు పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ నుంచి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడ నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్య సేవలు అందిస్తున్న సమయంలో పరిస్థితి విషమించడంతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. వైద్యశాల నుంచి అందిన నివేదిక ఆధారంగా కొల్లూరు ఏఎస్ఐ కట్టా వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతుడి బంధువులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఏఎస్ఐ తెలిపారు.



వడ్డే ఆంజనేయులు (ఫైల్)

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య

చినగంజాం: తండ్రి మందలించాడన్న కోపంతో మనస్తాపం చెంది ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని సంతరావూరులో మూడు రోజుల కిందట జరగగా సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శీలం రమేష్ వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన బారెపు నోవాహు కుమారుడు బారెపు బాలు (22) ఐటీఐ పూర్తి చేసి ఫైబర్ నెట్‌లో పనిచేశాడు. ఎనిమిది నెలల కిందట ఉద్యోగం మానేసి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈక్రమంలో మూడు రోజుల కిందట బాలు బెంగళూరుకు వెళ్తాను డబ్బులు ఇవ్వమని తండ్రిని అడిగాడు. దీంతో తండ్రి మందలించాడు. మనస్తాపం చెందిన బాలు వారి నివాసం ఉండే సమీపంలో పొగాకు బ్యారన్ పక్కన ఉన్న పశువుల కొష్టంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలు బెంగళూరుకు వెళ్లి ఉంటాడేమోనని తండ్రి భావించాడు. ఈక్రమంలో చుట్టు పక్కల వారు కొష్టం నుంచి దుర్వాసన వస్తోందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి చూడగా బాలు మృతదేహం కన్పించింది. బాలు అవివాహితుడు. పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల వైద్యశాలకు తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతి

బల్లికురవ: పొలంలో పశువుల మేత కోసేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై వ్యవసాయ కూలీ వైద్యం అందేలోపు చనిపోయాడు. ఈ ఘటన మండలంలోని కూకట్లపల్లి గ్రామ సమీపంలోని పొలాల్లో సోమవారం జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సురభి నాగేశ్వరరావు (46) కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామానికి ఉత్తరం వైపు ఉన్న ఎస్ఎల్ గుడిపాడు పొలాల్లో గడ్డి కోసేందుకు వెళ్లాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మోటార్‌కు సప్లయ్ వెళ్లే వైర్లు తగిలి షాక్‌కు గురయ్యారు. సమీప పొలాల్లో ఉన్న రైతులు హుటాహుటిన అతడిని అద్దంకి వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య ఏసమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏసమ్మ ఫిర్యాదు మేరకు బల్లికురవ పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు భౌతికకాయాన్ని అప్పగించారు. అందరితో కలివిడిగా ఉండే నాగేశ్వరరావు హఠాన్మరణంతో కుటుంబ సభ్యులు, కాలనీ వాసుల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.



మృతుడు నాగేశ్వరరావు

మహిళా కండక్టర్‌పై దాడి కేసులో జైలు, జరిమానా

మేడికొండూరు: మహిళా కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తికి శిక్షతో పాటు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడైన దండు రామనాథరెడ్డి విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ విధులకు అడ్డుపడ్డాడు. శారీరక దాడికి పాల్పడటమే కాకుండా, ఆమె ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడ్డాడు. వివరాలు.. మేడికొండూరు మండలంలో 2021 అక్టోబరు 2న మహిళా బస్సు కండక్టర్ షేక్ మొహిద్‌నిషా బేగంపై రామనాథరెడ్డి దాడి చేసి ఆమెను కొట్టి గాయపరిచాడు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టిన సాక్షులు, జరిగిన సంఘటనను కోర్టులో వివరించారు. వాదోపవాదనలు విన్న గుంటూరు 5వ జేఎఫ్‌సీఎం కోర్ట్ జడ్జి కోలార్ లత నేరం రుజువు కావడంతో రెండు సంవత్సరాలు జైలుశిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరుపు అల్లంశెట్టి పవన్ కుమార్ వాదనలు వినిపించారు.

ఇంటిపైకి దూసుకెళ్లిన కారు

ప్రహరీ ధ్వంసం



గోడను ఢీకొనడంతో ధ్వంసమైన కారు

చీరాల అర్బన్: పట్టణ పరిధిలోని కొత్తపేట సంపత్‌నగర్ కాలనీలోని మూడు రోడ్ల సెంటర్‌లో ఆదివారం రాత్రి కారు బీభత్సం సృష్టించింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కారు ఆదివారం రాత్రి మితిమీరిన వేగంతో అదుపు కాక మూడు రోడ్ల సెంటర్‌లో నివాసముంటున్న ఓ న్యాయవాది ఇంటి ప్రహరీని బలంగా ఢీకొంది. దీంతో కారు ముందు భాగం ధ్వంసమైంది. స్థానికులు దేహశుద్ధి చేస్తారనే భయంతో కారులోని వారు కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఈ సంఘటనతో భయభ్రాంతులైన స్థానికులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు కారు నంబర్ ఆధారంగా విచారణ చేస్తున్నారు. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో అదుపు చేయలేక గోడను ఢీకొట్టి ఉంటారని భావిస్తున్నారు.

ఉత్తమ ప్రదర్శనగా ‘27వ మైలురాయి’



ఉత్తమ ప్రదర్శన బహుమతిని అందుకుంటున్న ‘27వ మైలురాయి’ నాటిక బృందం

తెనాలి: రూరల్ మండలం కొలకలూరులో కొలంకపురి నాటక కళా పరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీల్లో యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారి ‘27వ మైలురాయి’ నాటిక ఉత్తమ ప్రదర్శన బహుమతిని అందుకుంది. ఇదే నాటికలో వైదేహి పాత్రలో నటించిన ప్రముఖ రంగస్థల, టీవీ, సినీ నటి సురభి ప్రభావతి ఉత్తమ నటిగా, రాజన్న పాత్రధారి పవన్‌కుమార్ ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా, నాటిక రచయిత పీటీ మాధవ్ ఉత్తమ రచయిత బహుమతులను అందుకున్నారు. మూడురోజులపాటు జరిగిన నాటికల పోటీల్లో విజేతలకు చివరి రోజైన ఆదివారం రాత్రి బహుమతులను అందజేశారు. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి, విశాఖపట్నం వారు ప్రదర్శించి ‘అ సత్యం’ నాటిక ఎంపికైంది. రఘుపతి పాత్రధారి వై.అనిల్‌కుమార్ ఉత్తమ ప్రతినాయకుడు, నాటిక దర్శకుడు పి.బాలాజీనాయక్‌కు, సంగీతాన్ని అందించిన పి.లీలామోహన్‌కు ఉత్తమ సంగీతం, ఉత్తమ లైటింగ్‌కు థామస్ బహుమతులను అందుకున్నారు. తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారి ‘స్వేచ్ఛ’ నాటిక ఎంపికైంది. ఇదే నాటికలో నటించిన గోవాడ వెంకట్ ఉత్తమ నటుడు అవార్డును గెలుచుకున్నారు. ‘మతమా మానవత్వమా’నాటికలో నటించిన కె.రాజేశ్వరికి ఉత్తమ క్యారెక్టర్ నటి బహుమతిరాగా, ‘మహాప్రస్థానం’లో సింహాద్రి పాత్రధారి బొర్రా నరేస్‌కు ఉత్తమ సహాయనటుడు బహుమతి లభించింది.

తండ్రిపై కొడుకు దాడి

అద్దంకి రూరల్: కన్నకొడుకు తండ్రిపై దాడి చేసి గాయపరిచిన ఘటన అద్దంకిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ సుబ్బరాజు కేసు నమోదు చేశారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. అద్దంకిలోని ద్వారకానగర్‌లో నివాసం ఉంటున్న తన్నీరు సవరయ్య తన కుమారుడు ఆంజనేయులు మద్యానికి బానిసై తరచూ భార్య పిల్లలను వేధిస్తున్నాడు. ఇటీవల కొడుకుపై తండ్రి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టాడు. అది మనసులో పెట్టుకుని కక్ష పెంచుకుని సోమవారం తండ్రిపై కర్రతో దాడి చేశాడు. తండ్రి సవరయ్యకు తలకు గాయం కావడంతో స్థానికులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

కారు ఢీ కొని వ్యక్తి మృతి



మృతిచెందిన కృష్ణంరాజు

కర్లపాలెం: వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలై మృతి చెందిన సంఘటన సోమవారం కర్లపాలెం మండలంలో చోటుచేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎం.రవీంద్ర తెలిపిన వివరాల మేరకు పిట్టలవానిపాలెం మండలం అలకాపురం గ్రామానికి చెందిన కూసంపూడి కృష్ణంరాజు ద్విచక్ర మోటారు వాహనంపై బాపట్ల వైపు వస్తుండగా యాజలి సెంటర్‌లోని ఆంజనేయ స్వామి విగ్రహం సమీపంలో జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న కారు ద్విచక్ర మోటారు వాహనాన్ని ఢీకొనటంతో కృష్ణంరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు నాగమురళి మోహన్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డుకు సోమవారం 1,239 బస్తాలు వచ్చాయి. మొత్తం అమ్మినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 889 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,300, గరిష్ఠ ధర రూ.11,450, మోడల్ ధర రూ.11,191 పలికింది. కాయలు 350 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,300, గరిష్ఠ ధర రూ.11,450, మోడల్ ధర రూ.11,150 లభించింది.